కష్టకాలంలో కానీకి కొరగావటంలేదు,
ఎందుకొచ్చిన రచనలు....?

# ★ అయితే, ఇప్పుడు ఏ డనే దేమిటి!

- బులుసు -
ప్రకాశమ్మ

మరీ అంత దీనిగా ఇదైపోతావెందుకు అమ్మాయీ?

ఏం చెయమంటా వన్నయ్యా?"

"పుట్టించిన దేవుడు పూరిమేపడు."

"ఏం దేవుడో! అయనేమో మూళ్లెళ్లయి మంచంమీద కాలు కిందపెట్టడం లేదాయె, ఈ హార్లిక్సులకీ నారింజపళ్ళకీ...."

"ఏదో నాలుగు రోజులు తిప్పలు, కాస్త లేచాడండే అతనే సర్దుకుంటాడు అన్నీ—"

"వొదిన పుట్టింటికి పురిటి కెళ్ళింది గనకా శెలవులో ఉన్నావు గనకా ఆదుకొని ఈ తిప్పలన్నీ పడగలుగుతున్నావుగాని — నీ ఇంటికి నువ్వెడితే మాగతేమిటి చెప్పు?"

"ఏదో ఆ భగవంతుడే చూపిస్తాడు దారి నువ్వు మరీ బెంగతో కుళిల్లిపోకు."

"బెంగెట్టుకోడం గాక నే చెయ్యగలిగిందేముం దన్నయ్యా?"

తెల్లవారిందీ అంటే ఎటుచూశినా ఖర్చు, ఖర్చు, ఖర్చు, దానికి మూడు, దీనికి రెండూ, ఇంకా ఆ మేనేజరు మంచివాడు గనక అడక్కుండా జీతం ఇంటికి పంపుతున్నాడు, ముప్ఫై రూపాయలు ఎన్నింటికని వస్తాయి? ఈ కరువు కాలంలో! నారింజపళ్ళు డజను రెండు రూపాయలెట్టినా దొరకడంలేదు!"

"ఇంటి కెళ్ళినంత మాత్రాన్ని మిమ్మల్ని మరిచిపోతా ననుకుంటున్నావా ఏమిటి నువ్వు మనస్సులో? బావ మళ్ళా లేచి అఫీసు కెళ్ళేదాకా నేనున్నాను నీకు సమస్తానికీ, బాధపడకు."

"తండ్రైనా అన్నగారైనా దేముడల్లే నువ్వాహాడవున్నావు గనకనే బతగ్గలుగుతున్నాను ఈ పరిస్థితుల్లో, నువ్వుమాత్రం ఎంత కనిపెట్టగలవు? వందలా, వేలా?—ఏభై రూపాయల జీతంలో,"

"పదింట్లో పదకొండు దానికేంలే అమ్మాయీ?

"ఏం లే! గడిపావు ఈ రెండునెల్లయి, ఎంత కాలం?—ఇల్లాగా! అది—దిక్కుమాలిన ఆడజన్మలు—ఏడవడం తప్పితే ఇంకేమీ చెయ్యలేవుగదా—ఆయనకోసం పక్క హార్లిక్సు సీసాయేనా నిన్ను కొదని నేను కొనలేను గదా?—

"చూడమ్మాయి! మరెందుకూ కాదుగానీ నా కోటి తోస్తోంది. చెబుతాను చేస్తావూ?"

"నువ్వు చెప్పడమూ, నేను చెయ్యకపోవడమూనా? అన్నయ్యా? ఏవి చెప్పినా నువ్వు నా మేలుకోరే చెప్తావు. చెప్పన్నయ్యా ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో?—"

"చదువుకున్నదానవు, విదుషివి,—"

ఆయన్నల్లా మంచాన వదిలి ఏ స్కూల్లో నేనా మాస్టరీ చెయ్యమంటావా ఏమిటి? కొంప తీసి?"

"ఆ వేళ సామ్రాట్టో చక్రవర్తో ఆ కవిగారు నీ పేర ఉత్తరంరాశారు జ్ఞాపకంవుందా?"

"అదా! ఆ వుత్తరమా? ఏదో ముఖ ప్రీతికి రాశారుగాని నిజంగా నేనంత గొప్పదాన్నా ఏమిటి?

"నీకు తెలియదుగాని నిజంగా నీ భాషలో నీ భావాల్లో అంత గొప్పతనం ఉండేవుంది. కనకనే ఆయన ఆ విధంగా రాశాడు. నిన్ను ముఖస్తుతి చెయ్యకపోతే ఆయనకి గడవక రాశాడనుకున్నావా? ఏమనీ? ఆయన రాశిందీ?"

* ఆనందవాణి

"ఏదో లెద్దూ! ఇప్పుడెందు కధంతా!"

"అహ, అల్లాక్కాదు. పారేయలేదుకదా ఆ వుత్తరం?"

"ఏముందీ! 'మీ తెనుగు స్వచ్ఛమైన జాను తెనుగు-సాంకర్యంలేని తెనుగు నుడికారం గల భాష మీ వంటి విదుషీరచయిత్రులద్వారానే వస్తుందని నా విశ్వాసం. మీ రచనలు ఉత్తమ స్వతంత్ర రచనలు—ఇల్లాంటివే ఏవేవో రాశా రాయన, ప్రోత్సహించడానికి గాకపోతే నిజంగా నేనంత గొప్పదాన్నా ఏమిటి?"

"లేదమ్మా! నిజంగా నీ రచనలు అంత గొప్పవే. నీకు తెలియదు.

"ఎందుకొచ్చిన రచనలు! కష్టకాలంలో కానీకి కొరగావడం లేదు నా రచనలు.

"లేదమ్మా. మునపటిలా కాదు. ఇప్పుడంతా మారిపోయింది కాలం. స్త్రీలు ప్రతివిషయం లోనూ పురుషులతో సమానగౌరవాలు పొందు తున్న కాలం ఇది."




బిటా కేఫిన్
(తలనొప్పి బిళ్ళలు)

అన్ని నొప్పులను జ్వరములను కుదుర్చును.
తలనొప్పి, పంటినొప్పి, కాళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, నిద్రపట్టకుండుట, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట, మలేరియా, వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడు కొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు 1 అణా
అన్ని మందుల షాపులలోను లభ్యమగును

Stockists:
Messrs, Dadna & Co., P T., Madras.
Manufacturers:
**BOMBAY TABLET MFG. CO.**
P. O. Box No. 2092. BOMBAY. 2

"అయితే నువ్విప్పుడనేదేమిటి? ఈ స్థితిలో జబ్బుమనిషి సేవలో మునిగుంటున్న ఈ అవస్థలో రాతలు రాయమంటావా ఏమిటి?-"

"అవును రాయమంటాను. ఇల్లాంటప్పుడే రాయాలి. 'సాహిత్య సేవ చేస్తూ సంసార మీదిన స్త్రీ" అన్న గౌరవం నీకు రావాలి అంటాను నేను.

"........నువ్వు చెప్పినట్టే చేస్తానన్నయ్యా! రాస్తాను కథ. భగవంతుడు నా కిచ్చిన బుద్ధినంత నీ వినియోగించి చక్కని పెద్దకథ వకటి రాస్తాను. నా కథ పేరు 'నారీ జీవితము,........' ఎడిటరు పంపే ప్రతిఫలంతో—మంచి పళ్లా-హార్లిక్సూ కొని...."నా స్వార్జితంతో కొన్న పళ్లు సుమండీ! ఇవి" అంటూ వొలిచి బావకి తినిపిస్తూంటే బావ ఎంత సంబరపడతారు!! తలుచుకుంటూంటేనే మనస్సు పొంగిపోతోంది. ఈ వేళే రాస్తాను కథ........

★

"పోస్టు బంట్రోతొచ్చి వెళ్ళాడా! అమ్మాయీ?"

"ఆ........"

"పట్నాన్నించేమేనా వచ్చిందా?"

"ఆ........"

"వచ్చిందా! విద్య నేర్చుకున్నందుకు.... సార్థక్యం....ఏదీ వుత్తరం?...."

"గదిలో బల్లమీదుంది."

"..............."

మద్రాసు.
1-7-47

అమ్మా?

మీరు దయతో పంపిన 'నారీజీవితం' వాస్తవిక రచన. కథ ద్వారా నారీలోకమునకు మీ రిచ్చిన శుచిభావములు ఎంతయు కొనియాడ దగినవి. ప్రఖ్యాత ప్రతిభను మా పత్రిక తప్పక గౌరవింపగలదు. అచిరకాలంలోనే తాము సాహిత్య క్షేత్రంలో ఉత్తమ శ్రేణి నలంకరిం తురుగాక అని మనవి.

సెలవు
ఎడిటర్,

"అయితే ఇప్పుడు వీడనేదేమిటి?"

"..............."

"వీళ్ళక్కావలసింది రచనా? పేరా?"